Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :05 సంచిక : 88 పేజీలు 8 వెల : 5 గురువారం 15 అక్టోబర్ 2026






# 5వ పార్టీలోకి వంగవీటి రాధా?





## జనసేనలోకి వంగవీటి రాధా? .. విజయవాడ మేయర్ పీఠంపై గురి

### జనసేన నుంచి పోటీకి చాన్స్..?.. బెజవాడలో కొత్త రాజకీయ సమీకరణాలు

దశాబ్దాలు గడిచినా వంగవీటి మోహనరంగా పేరు విజయవాడ రాజకీయాల్లో చెరిగిపోని ముద్రగానే ఉంది. ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ రాజకీయ ప్రయాణం మరో కీలక మలుపు తిరగబోతోందన్న ప్రచారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. టీడీపీని వీడి జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో విజయవాడ రాజకీయాల్లో కొత్త లెక్కలు మొదలయ్యాయి. ఈ మార్పు వెనుక మేయర్ పీఠం లక్ష్యంగా ఉందా? రాధాకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్న ప్రయత్నమా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

విజయవాడ: తండ్రి వంగవీటి మోహనరంగా అడుగుజాడల్లో రాధా తన రాజకీయ ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభించారు. 2004లో విజయవాడ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ప్రజారాజ్యం, వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీల్లో కొనసాగారు. రాజకీయంగా వివిధ పార్టీల్లో పనిచేసినా, తన కుటుంబ నేపథ్యానికి, వ్యక్తిగత గుర్తింపునకు తగిన స్థాయిలో కీలక పదవులు దక్కలేదన్న అభిప్రాయం ఆయన అభిమానుల్లో ఉంది. పార్టీ మారిన ప్రతిసారీ ఆయన రాజకీయ భవిష్యత్తుపై చర్చ జరిగినా, రాష్ట్రస్థాయి రాజకీయాల్లో కీలక బాధ్యతలు చేపట్టే స్థాయికి ఎదగలేకపోయారన్న విశ్లేషణలు వినిపించాయి. ఇప్పుడు జనసేనలోకి అడుగుపెడితే ఆయన రాజకీయ ప్రస్థానానికి కొత్త దిశ లభిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో టీడీపీపై తీవ్ర విమర్శలు తరువాయి 2 వ పేజీలో..

# బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

**నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు**

**ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి**

**దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము**



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు.



## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం.. ఇక రోజువారీ విచారణ

**జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ**

**విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం**

**జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ**

**పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు**

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

# విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

**టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం**

**బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు**

**చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం**



ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరఫున జెడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

# భారత నౌకాదళంలోకి 'సమర్థక్' యుద్ధనౌక

న్యూఢిల్లీ, అక్టోబర్ 13

భారత నౌకాదళం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మరో కీలక అడుగు వేయనుంది. బహుళ ప్రయోజనాల కోసం రూపొందించిన 'సమర్థక్' నౌకను అక్టోబర్ 16న కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరంలో నౌకాదళంలోకి అధికారికంగా ప్రవేశపెట్టనున్నారు. నౌకాదళంలోకి చేరనున్న నాలుగు బహుళ ప్రయోజన నౌకల్లో సమర్థక్ మొదటిది. సముద్ర నిఘా, గస్తీ విధులతోపాటు వివిధ రకాల సముద్ర కార్యకలాపాలను నిర్వహించగలిగేలా దీనిని రూపొందించారు. మారుతున్న సముద్ర భద్రత అవసరాలకు అనుగుణంగా విభిన్న విధుల్లో ఉపయోగించుకునే సామర్థ్యం ఈ నౌకకు ప్రత్యేకతగా నిలవనుంది. సముద్ర ప్రాంతాల్లో నిఘా నిర్వహించడం, గస్తీ కాయడం సమర్థక్ ప్రధాన విధుల్లో భాగంగా ఉండనున్నాయి. తక్కువ తీవ్రత కలిగిన సముద్ర కార్యకలాపాలను కూడా ఈ నౌక నిర్వహించగలదు. సముద్ర భద్రతకు సంబంధించిన పరిస్థితులను పర్యవేక్షించడం, అవసరమైన ప్రాంతాల్లో కార్యకలాపాలు చేపట్టడం ద్వారా నౌకాదళానికి మద్దతు



అందించనుంది. సముద్రంలో తలెత్తే వివిధ పరిస్థితులకు అనుగుణంగా తన విధులను మార్చుకునే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల దీన్ని బహుళ ప్రయోజన వేదికగా వినియోగించుకోవచ్చు. సముద్ర ప్రాంతాల్లో నౌకాదళ కార్యకలాపాల నిర్వహణకు ఇది అదనపు సామర్థ్యాన్ని అందించనుంది. లక్ష్యాల మోహరింపు, పరీక్షా కార్యక్రమాల నిర్వహణకు కూడా సమర్థక్‌ను ఉపయోగించనున్నారు. అదేవిధంగా మానవరహిత, స్వయంచాలక వ్యవస్థలకు మాతృనౌకగా పనిచేసే సామర్థ్యం దీనికి ఉంది. ఈ విధంగా సముద్రంలో వినియో గించే ఆధునిక సాంకేతిక వ్యవస్థలను మోహరించడానికి, వాటి కార్యకలాపాలకు అవసరమైన వేదికగా నౌక ఉపయోగపడనుంది. నౌకాదళంలో సాంకేతిక ఆధారిత కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి నౌకల అవసరం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పరీక్షలు, నిఘా, ప్రత్యేక సముద్ర కార్యకలాపాల కోసం ఒకే నౌకను విభిన్న అవసరాలకు అనుగుణంగా వినియో గించుకోవడం దీని ప్రధాన లక్షణాల్లో ఒకటి. యుద్ధేతర పరిస్థితుల్లోనూ సమర్థక్ సేవలు అందించ గలదు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు, బాధితు లకు అవసరమైన సహాయం అందించే మానవతా కార్యక్రమాల్లో దీనిని వినియో గించవచ్చు. అవసరాన్ని బట్టి పరిమిత స్థాయి ఆసుపత్రి నౌకగా మార్చు కునే సామర్థ్యం కూడా దీనికి ఉంది. సముద్రంలో ప్రమా దాలకు గురైన నౌకలకు సంబంధించిన రక్షణ, వాటిని వెలికితీసే పనుల్లోనూ సహకరించగలదు. ఇలా రక్షణ విధులతోపాటు విపత్తుల నిర్వహణ, అత్యవసర సహాయం, సముద్ర రక్షణ కార్యకలాపాల్లోనూ సమర్థక్ ఉపయోగపడేలా రూపొందించారు. సమర్థక్ నౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టడం ద్వారా భారత నౌకాదళానికి బహుళ అవసరాలను తీర్చగల మరో వేదిక అందుబాటులోకి రానుంది.



## జనసేనలో చేరిన వంగవీటి రాధా.. విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?

**కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్**
**విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు**
**జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్**
**విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం**

కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది.విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది.మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది.స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల.. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ) అనిల్ చంద్ర పుణేతా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖూదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.

# హైదరాబాద్‌కు కీలక ప్రాజెక్టులు

హైదరాబాద్, అక్టోబర్ 13: తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన ఆయన.. ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించినట్లు వెల్లడించారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన ప్రతిపాదనపైనా గడ్కరీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారి 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. పర్వతమాల పథకం కింద తెలంగాణకు ఐదు రోప్‌వేలు, సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు ఆమోదం లభించిం దన్నారు. హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా సానుకూల స్పందన వచ్చిందని, రాష్ట్రంలో 34 పనులకు సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని, హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం మార్గం విస్తరణ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సుకు హాజరు కావాలని గడ్కరీని కోమటిరెడ్డి ఆహ్వానించారు. కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రవాణా



అనుసంధానం మెరుగుపడటంతో పాటు పర్యాటకానికి ఊతం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

# 5వ పార్టీలోకి వంగవీటి రాధా?

మొదటి పేజీ తరువాయి

చేసిన రాధా, 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయంగా చర్చకు దారితీసింది. వంగవీటి మోహనరంగా మరణానికి సంబంధించిన పాత రాజకీయ జ్ఞాపకాలు, భావోద్వేగాలు ఈ నిర్ణయంపై కొందరిలో అసంతృప్తికి కారణమయ్యాయి. అయినప్పటికీ రాధా టీడీపీలో కొనసాగారు. అయితే, అక్కడ ఆయనకు ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాధాన్యం దక్కిందా? తన అనుచరుల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళ్లగలిగారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు మరోసారి తెరపైకి వస్తున్నాయి. పార్టీ మార్పుల వెనుక పదవులే కారణమని తేల్చడం కంటే, ఆయా దశల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉంది.



### జనసేనలోకి ఆహ్వానం.. పవన్ వ్యూహమేనా?

విజయవాడలో జనసేనను మరింత బలోపేతం చేయాలంటే స్థానికంగా గుర్తింపు ఉన్న నాయకుడి అవసరం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాధాకృష్ణను పార్టీలోకి తీసుకురావడం జనసేనకు రాజకీయంగా ప్రయోజనం కలిగించవచ్చని భావిస్తున్నారు. నగరంలో ఆయనకు ఉన్న పరిచయాలు, అనుచర వర్గం, వంగవీటి కుటుంబానికి ఉన్న చారిత్రక రాజకీయ గుర్తింపు పార్టీకి అదనపు బలంగా మారవచ్చు. రాధాకు మేయర్ అభ్యర్థిత్వం కల్పించాలన్న ప్రతిపాదనపై చర్చ జరుగుతున్నట్లు ప్రచారం ఉన్నప్పటికీ, దీనిపై అధికారిక నిర్ధారణ లేదు. చేరికతో పాటు బాధ్యతల కేటాయింపు కూడా స్పష్టమైతేనే పవన్ కల్యాణ్ వ్యూహంపై పూర్తి అంచనాకు రావచ్చు.

### మేయర్ పీఠం కోసం కూటమిలో కొత్త లెక్కలా?

విజయవాడ మేయర్ స్థానంపై జనసేన పట్టుబడుతోందన్న ప్రచారం కూటమి రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. టీడీపీకి నగరంలో బలమైన నాయకత్వం, సంస్థాగత నిర్మాణం ఉండగా, జనసేన కూడా తన రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే సీట్ల సర్దుబాటు ఎలా ఉంటుంది? టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా స్పందిస్తారు? రెండు పార్టీల మధ్య సమన్వయం ఎలా సాధ్యమవుతుంది? అన్నది కీలకంగా మారుతుంది. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మధ్య రాజకీయ సమన్వయం ఈ వ్యవహారంలో ముఖ్యమైన పాత్ర పోషించవచ్చు. అయితే, తాజాగా జనసేన నుంచి వంగవీటి రాధా బరిలోకి దిగాలని డిసైడ్ అయినట్టు తెలుస్తోంది.

### ముక్కుసూటితనం బలమా.. రాజకీయ బలహీనతా?

రాధాకృష్ణ రాజకీయ శైలిపై కూడా చర్చ జరుగుతోంది. తనకు కావాల్సిన పదవుల కోసం బహిరంగంగా పట్టుబట్టడం కంటే, మౌనంగా ఉండే స్వభావం ఆయనకు ఉందని అనుచరులు చెబుతుంటారు. అదే సమయంలో రాజకీయాల్లో వ్యక్తిగత గుర్తింపుతో పాటు సంస్థాగత బలం, నాయకత్వంతో నిరంతర సమన్వయం, కార్యకర్తలకు అవకాశాలు కల్పించడం కూడా అవసరం. రాధా ఇప్పటివరకు తన రాజకీయ బలాన్ని ఎంతవరకు పదవులుగా మార్చుకోగలిగారన్నది ఒక ప్రశ్నగా మిగిలింది. జనసేనలో చేరి ఈసారి ఆయన తన రాజకీయ పాత్రను విస్తరించుకుంటారా? అనుచరులకు మరింత ప్రాధాన్యం కల్పించగలరా? అన్నది ఆయన తీసుకునే తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

### రంగా వారసత్వం నుంచి ఎన్నికల బలం వరకు:

వంగవీటి మోహనరంగా పట్ల విజయవాడలోని పలువర్గాలకు ఉన్న అభిమానం రాధాకు రాజకీయ గుర్తింపును అందించే అంశాల్లో ఒకటి. అయితే, ఆ వారసత్వం ఒక్కటే ఎన్నికల్లో విజయాన్ని ఖాయం చేయదు. వార్డు స్థాయి నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమస్యలపై ప్రజల అభిప్రాయం, కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ, ప్రత్యర్థుల వ్యూహాలు కీలకం కానున్నాయి. రాధా జనసేనలో చేరి మేయర్ బరిలోకి దిగితే, అది ఆయన వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుకే కాకుండా విజయవాడలో టీడీపీ--జనసేన సంబంధాలకూ పరీక్షగా మారవచ్చు. చివరికి రాధా కొత్త రాజకీయ వేదికను ఎంచుకోవడం ఎంత ముఖ్యమో, ఆ వేదికపై ఆయనకు ఎలాంటి స్థానం దక్కుతుందన్నది అంతే కీలకం. అధికారిక నిర్ణయాలు వెలువడిన తర్వాతే ఈ రాజకీయ మలుపు ప్రభావం ఎంతవరకు ఉంటుందో స్పష్టమవుతుంది.

# సంపాదకీయం

## మస్క్ కోసం నిబంధనలు మారవు



భారత్‌లో వ్యాపారం చేయాలంటే ఈ దేశ చట్టాలను పాటించాల్సిందే. ఇది కొత్తగా చెప్పాల్సిన నియమమేమీ కాదు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఇదే విధానం. కానీ టెస్లా, స్పేస్ఎక్స్, స్టార్‌లింక్ వంటి సంస్థల అధినేతగా ఉన్న ఎలాన్ మస్క్ మాత్రం ఈ సాధారణ సూత్రాన్ని మరచిపోతున్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంపై ఆయన చేసిన వ్యాఖ్యలు వ్యాపార అసహనాన్ని మించి.. ఒక దేశ అంతర్గత వ్యవహారాలపై అనవసర వ్యాఖ్యలుగా మారాయి. భారత్‌లో స్టార్‌లింక్‌కు యూనిఫైడ్ లైసెన్స్ ఇప్పటికే మంజూరైంది. అయితే భద్రతా అనుమతులు, నియంత్రణపరమైన ఇతర ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంది. ఇది స్టార్‌లింక్‌కు మాత్రమే వర్తించే నిబంధన కాదు. శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలోకి రావాలనుకుంటున్న ఇతర సంస్థలకూ ఇదే ప్రక్రియ వర్తిస్తుంది. రిలయన్స్ జియో, వన్‌వెబ్ తదితర సంస్థలూ ఇదే నియంత్రణ వ్యవస్థ పరిధిలో ఉన్నాయి. అలాంటప్పుడు స్టార్‌లింక్‌ను భారత్ కావాలనే అడ్డుకుంటోందని ఆరోపించడానికి ప్రాతిపదిక ఏమిటి? అయితే మస్క్ అక్కడితో ఆగలేదు. కొందరు 'ఒలిగార్కులు' తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికి స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. భారత ప్రజలకు మెరుగైన ఇంటర్నెట్ అందకుండా చేయడం నేరం అన్నట్టుగా మాట్లాడారు. భారతీయ వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని కూడా ఆయన విమర్శలు చేశారు. కానీ తన ఆరోపణలకు తగిన ఆధారాలను మాత్రం చూపలేదు. ఇది ఒక అంతర్జాతీయ పారిశ్రామికవేత్త నుంచి ఆశించదగిన బాధ్యతాయుత వైఖరి కాదు. భారత్‌లో ఇంటర్నెట్ రంగంలో పోటీకి కొదవలేదు. టెలికాం రంగంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి సంస్థలు ఇప్పటికే కోట్లాది వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. శాటిలైట్ ఇంటర్నెట్ రంగంలోనూ పోటీకి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాలు, సముద్ర దీవులు వంటి చోట్ల వేగవంతమైన ఇంటర్నెట్ అందించడంలో శాటిలైట్ సాంకేతికత ఉపయోగకరమే. ఆ అవసరాన్ని భారత్ కూడా గుర్తించింది. అందుకే స్టార్‌లింక్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. అయితే లైసెన్స్ ఇచ్చినంత మాత్రాన భద్రతా నిబంధనలను పక్కన పెట్టాలని ఏ దేశమూ కోరదు. శాటిలైట్ కమ్యూనికేషన్ అనేది సాధారణ వినియోగదారులకు అందించే సేవ మాత్రమే కాదు. సైనిక, వ్యూహాత్మక, సరిహద్దు భద్రతకు సంబంధించిన అంశాలు కూడా దానితో ముడిపడి ఉంటాయి. వినియోగదారుల సమాచార భద్రత, నెట్‌వర్క్ పర్యవేక్షణ, చట్టబద్ధమైన సమాచార ప్రాప్తి, డేటా భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వానికి స్పష్టమైన హామీలు అవసరం. వీటిని పరిశీలించకుండా కేవలం 'ప్రజలకు ఇంటర్నెట్ కావాలి' అన్న కారణంతో విదేశీ సంస్థలకు స్వేచ్ఛ ఇవ్వడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. స్టార్‌లింక్‌కు భారత్ ఎంత అవసరమో.. భారత్ మార్కెట్ స్టార్‌లింక్‌కు అంతకంటే ఎక్కువ అవసరం. ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం మార్కెట్లలో భారత్ ఒకటి. కోట్లాదిమంది ఇంటర్నెట్ వినియోగదారులు, విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఇంకా పూర్తిగా కనెక్టివిటీ అందని భారీ గ్రామీణ ప్రాంతం.. ఇవన్నీ స్టార్‌లింక్‌కు అపారమైన వ్యాపార అవకాశాలు. అందుకే భారత్ మార్కెట్లోకి రావాలన్న మస్క్ ఉత్సాహం అర్థం చేసుకోవచ్చు. కానీ ఆ వ్యాపార ప్రయోజనాన్ని దేశ నియంత్రణ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ఆయుధంగా ఉపయోగించడం మాత్రం ఆమోదయోగ్యం కాదు. స్టార్‌లింక్ భారత్‌కు రావడం వల్ల పోటీ పెరుగుతుంది. సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. మారుమూల ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ లభించే అవకాశం ఉంటుంది. ఇవన్నీ స్వాగతించాల్సిన పరిణామాలే. కానీ పోటీ అంటే నియమాల నుంచి మినహాయింపు కాదు. విదేశీ పెట్టుబడి అంటే సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టడం కాదు. ప్రపంచస్థాయి సాంకేతికతను అందించడం అంటే దేశ భద్రతా ఆందోళనలను విస్మరించడానికి లైసెన్స్ కాదు. మస్క్ ప్రపంచాన్ని మార్చే సాంకేతికతలను సృష్టించిన పారిశ్రామికవేత్త కావచ్చు. కానీ ఎంతటి సాంకేతిక సామర్థ్యం ఉన్నా, ఏ దేశ చట్టాలకూ అతీతుడు కాదు. భారత్ ఆయనకు మార్కెట్ కావచ్చు; భారతీయులు ఆయనకు వినియోగదారులు కావచ్చు. కానీ భారత్ ఆయన నియంత్రించగలిగే మార్కెట్ కాదు. ఇది సార్వభౌమ దేశం. స్టార్‌లింక్ రావడాన్ని భారత్ అడ్డుకోవాల్సిన అవసరం లేదు. అదే సమయంలో స్టార్‌లింక్ కోసం భారత్ తన నియమాలను మార్చుకోవాల్సిన అవసరం అంతకంటే లేదు. భారత్‌కు స్టార్‌లింక్ అవసరం ఉండవచ్చు. కానీ స్టార్‌లింక్‌కు భారత్ ఇచ్చే అనుమతి భారత నిబంధనల ప్రకారమే ఉండాలి. మస్క్ ఎంత త్వరగా ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుంటే ఆయనకూ, స్టార్‌లింక్‌కూ అంత మంచిది.

## జీఓలు.. బారికేడ్లతోనే పాలన సాగుతుందా?

- ప్రజల ప్రశ్నలకు సమాధానాలేవి? ప్రజాస్వామ్యంలో ఆంక్షలే పరిష్కారమా?



ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులకు అధికారం కట్టబెడతారు. అలాంటి ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నలు అడిగినప్పుడు, ప్రభుత్వ విధానాలను విమర్శించినప్పుడు వారికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది. ప్రజల సందేహాలను నివృత్తి చేయడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, విమర్శలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించడం ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం. అయితే ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన చోట ఆంక్షలు విధించడం, నిరసనలను అడ్డుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయడం, ప్రజల కదలికలను పరిమితం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. పాలన అంటే కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం, నిబంధనలు అమలు చేయడం మాత్రమే కాదు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని వాటికి పరిష్కారాలు చూపించడం కూడా పాలకుల బాధ్యతేననే విషయాన్ని గుర్తించాలి. ప్రజాస్వామ్యానికి ప్రజల విశ్వాసమే పునాదిఎన్నికల్లో విజయం సాధించడంతో ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదు. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. ప్రజలు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ప్రజల హక్కులకు భంగం కలగకుండా పరిపాలన సాగించాలి. ప్రజాస్వామ్యంలో అధికారానికి అసలైన బలం ప్రజల విశ్వాసమే తప్ప, ఆంక్షలు, నిర్బంధాలు కాదనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. ప్రభుత్వ విధానాలపై విమర్శలు వచ్చినప్పుడు వాటిని శత్రుత్వంగా భావించడం సరికాదు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని, అవసరమైన చోట తప్పులను సరిదిద్దుకోవడం ద్వారా పాలన మరింత మెరుగుపడుతుంది. ప్రజల గొంతును అణచివేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. పైగా ప్రజల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అత్యంత కీలకమైనది. ప్రభుత్వ నిర్ణయాలపై అసమ్మతి వ్యక్తం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే పౌరుల హక్కులను గౌరవించాలి. నిరసనల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఆ పేరుతో ప్రజల సాధారణ జీవనాన్ని విస్తృతంగా ప్రభావితం చేసే చర్యలకు పాల్పడటం సమంజసం కాదు. నిరసనలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేటప్పుడు వాటి తీవ్రత, పరిధి, ప్రజలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా, నిరసనకారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు తగిన అవకాశాలు కల్పించాలి. ప్రజల హక్కులను కాపాడుతూనే శాంతిభద్రతలను పరిరక్షించే సమతుల్య విధానాన్ని అనుసరించాలి.

# రష్యా డీజిల్‌పై ట్రంప్ ద్వంద్వనీతి

అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. శాశ్వతంగా ఉండేది జాతీయ ప్రయోజనాలే అనే మాట మరోసారి నిజమవుతోంది. ప్రపంచానికి ప్రజాస్వామ్యం, న్యాయం, అంతర్జాతీయ నియమాల గురించి ఉపన్యాసాలు ఇచ్చే అగ్రరాజ్యం అమెరికా, తన ఆర్థిక ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి అదే నియమాలను ఎలా పక్కన పెడుతుందో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తీసుకున్న రష్యా డీజిల్ కొనుగోలు నిర్ణయం స్పష్టం చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై సుంకాల భారం మోపుతూ, ఆ దేశానికి ఆర్థికంగా సహకరిస్తున్నారంటూ విమర్శలు చేసిన ట్రంప్.. ఇప్పుడు తన దేశ అవసరాల కోసం అదే రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకోవడానికి సిద్ధపడటం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అమెరికా తన ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయం భారత్ విషయంలో అనుసరించిన ద్వంద్వ వైఖరిని ప్రపంచం ముందు నిలబెట్టింది. రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యా ఆదాయాన్ని తగ్గించడం ద్వారా ఆ దేశ యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయాలన్నది అమెరికా సహా పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రధాన ఉద్దేశం. ఈక్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై కూడా అమెరికా ఒత్తిడి పెంచింది. ముఖ్యంగా భారత్ రష్యా నుంచి తక్కువ ధరకు ముడిచమురు కొనుగోలు చేయడాన్ని ట్రంప్ ప్రభుత్వం తప్పుబట్టింది. భారత్‌పై అదనపు సుంకాలు విధించడంతోపాటు, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు చేసింది. భారత్ తన ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాన్ని కూడా అమెరికా రాజకీయ ఒత్తిడికి ఒక సాధనంగా ఉపయోగించుకుంది. అయితే, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం, దేశీయంగా ప్రజలపై పడుతున్న ఆర్థిక భారం, రాబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి వంటి అంశాల మధ్య ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో డీజిల్ సరఫరా ఒప్పందాన్ని ప్రకటించారు. అక్టోబర్ 9న వెలువడిన ప్రకటన ప్రకారం, రష్యా నుంచి డీజిల్ సరఫరాలను ప్రారంభించి, తదుపరి దశల్లో వాటిని పెంచే ప్రణాళికను ట్రంప్ వెల్లడించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా అమెరికా ఆర్థిక శాఖ కూడా రష్యా డీజిల్‌కు సంబంధించిన కొన్ని లావాదేవీలకు పరిమిత కాలానికి అనుమతినిచ్చింది. అయితే ప్రకటించిన సరఫరాలన్నీ పూర్తిగా అమలవుతాయా, అవి అమెరికా మార్కెట్‌లో ధరలను ఎంతవరకు తగ్గిస్తాయా అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. అమెరికాకు ఇంధనం అవసరమైనప్పుడు రష్యా నుంచి డీజిల్ కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనమైతే, భారత్ తన ఇంధన అవసరాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం తప్పెలా అవుతుంది? అమెరికా ప్రజలపై ధరల భారం పడకూడదని ట్రంప్ భావించడం సమంజసమే. కానీ అదే ఆర్థిక తర్కాన్ని భారత్ అనుసరించినప్పుడు దానిని తప్పుబట్టడం ఏ విధంగా న్యాయబద్ధమవుతుంది? అమెరికాకు ఒక న్యాయం, భారత్‌కు మరో న్యాయం ఉండాలా? ఈ ప్రశ్నకు ట్రంప్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన వినియోగదారులలో ఒకటి. దేశీయ అవసరాలకు సరిపడా ముడిచమురును ఉత్పత్తి



చేసుకోలేకపోవడంతో, దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. దాని ప్రభావం సామాన్య ప్రజల కుటుంబ బడ్జెట్‌పై పడుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలపై ఇంధన ధరల ప్రభావం ఉంటుంది. అందువల్ల తక్కువ ధరకు లభించే ముడిచమురును కొనుగోలు చేయడం భారత్‌కు కేవలం వాణిజ్య నిర్ణయం మాత్రమే కాదు; దేశ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశం కూడా. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులను భారత్ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. రష్యా నుంచి రాయితీ ధరలకు ముడిచమురును కొనుగోలు చేయడం ద్వారా దిగుమతి ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నించింది. ఇది భారత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయం. ఒక దేశం తన ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు ఇంధనాన్ని సమకూర్చుకోవాలనుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన ఆలోచన కాదు. అంతేకాకుండా, భారత్ తన విదేశాంగ విధానంలో వ్యూహాత్మక స్వతంత్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. అమెరికాతో సంబంధాలను కొనసాగిస్తూనే రష్యాతోనూ సంబంధాలను కాపాడుకోవాలనే వైఖరి దశాబ్దాలుగా భారత దౌత్య విధానంలో భాగంగా ఉంది. అయినప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అదనపు సుంకాలు విధించడం, మరిన్ని ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడం అంతర్జాతీయ వాణిజ్యంలో సమానత్వ సూత్రంపై సందేహాలు కలిగించింది. ఇప్పుడు అమెరికా కూడా రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధపడటంతో ఆ సందేహాలు మరింత బలపడ్డాయి. అమెరికా తన అవసరాల కోసం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, భారత్‌కు మాత్రం అలాంటి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదన్నట్లుగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. అయితే, ఈ వ్యవహారాన్ని కేవలం వ్యక్తిగత రాజకీయ విమర్శలకు పరిమితం చేయకూడదు. దేశాల ఇంధన అవసరాలు, దిగుమతి చేసుకునే ఇంధన రకం, ఆంక్షల పరిధి, ఒప్పందాల నిబంధనలు వేర్వేరుగా ఉండవచ్చు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం, రష్యాలో ఉత్పత్తి చేసిన డీజిల్‌ను దిగుమతి చేసుకోవడం రెండూ ఒకే రకమైన వాణిజ్య లావాదేవీలు కావు. ట్రంప్ నిర్ణయం వెనుక దేశీయ రాజకీయాల ప్రభావాన్ని కూడా విస్మరించలేం. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం పాలక ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారవచ్చు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ధరల నియంత్రణ ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేసే అంశం. ప్రజలకు తక్కువ ధరలకు ఇంధనం అందించగలిగితే రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందని పాలకులు భావించడం సహజం. అందుకే రష్యాతో సంబంధాల విషయంలో గతంలో అనుసరించిన కఠిన వైఖరిని సడలించేందుకు ట్రంప్ సిద్ధపడినట్లు కనిపిస్తోంది. అయితే, ఇంధన ధరల తగ్గింపు ఎంతవరకు సాధ్యమవుతుందన్నది సరఫరాల పరిమాణం, అంతర్జాతీయ డిమాండ్, రవాణా వ్యయాలు, శుద్ధి సామర్థ్యం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కేవలం ఒప్పంద ప్రకటనతోనే ధరలు గణనీయంగా తగ్గుతాయని చెప్పలేం. ఈ ఒప్పందం ఉక్రెయిన్‌కు కూడా ఆందోళన కలిగిస్తోంది. రష్యా యుద్ధం కొనసాగుతున్న సమయంలో ఆ దేశానికి ఇంధన ఎగుమతుల ద్వారా ఆదాయం లభిస్తే, అది పరోక్షంగా రష్యా ఆర్థిక వ్యవస్థకు తోడ్పడవచ్చన్నది ఉక్రెయిన్ వాదన. అమెరికా ఇంతకాలం రష్యా ఆదాయాన్ని తగ్గించేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో, ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ కొనుగోలు చేయాలనే నిర్ణయం ఆంక్షల ప్రభావాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు యుద్ధానికి ఎంతవరకు ఆర్థికంగా దోహదపడతాయన్నది వేరే విశ్లేషణకు సంబంధించిన అంశమైనప్పటికీ, అమెరికా విధానంలో కనిపిస్తున్న మార్పు మిత్రదేశాల్లో అనుమానాలకు తావిస్తోంది. భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి దిగుమతుల మూలాలను విస్తరించాలి. ఒకే దేశంపై అధికంగా ఆధారపడకుండా, రష్యా, పశ్చిమాసియా, అమెరికా తదితర ప్రాంతాల నుంచి సరఫరాలను సమతుల్యం చేసుకోవాలి. దేశీయ చమురు అన్వేషణ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, విద్యుత్ ఆధారిత రవాణా, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులను పెంచాలి. అంతర్జాతీయ రాజకీయాల్లో ఏ దేశం ఎప్పుడు తన వైఖరిని మార్చుకుంటుందో చెప్పలేని పరిస్థితుల్లో, స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడం అత్యంత అవసరం. చివరగా, ట్రంప్ రష్యా డీజిల్ ఒప్పందం భారత్‌కు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో నీతి, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి విలువల గురించి ఎంతగా మాట్లాడినా, సంక్షోభ సమయంలో దేశాలు ముందుగా తమ ప్రయోజనాలనే పరిగణనలోకి తీసుకుంటాయి. అమెరికా తన ప్రజల కోసం రష్యా డీజిల్‌ను కొనుగోలు చేయడం తప్పు అని మాత్రమే చెప్పడం ఈ సమస్యకు పరిష్కారం కాదు. కానీ అదే నిర్ణయం తీసుకున్న భారత్‌ను గతంలో శిక్షించడానికి ప్రయత్నించడం మాత్రం ప్రశ్నించదగిన ద్వంద్వ వైఖరి. అమెరికాకు తన ప్రజల ప్రయోజనాలను కాపాడుకునే హక్కు ఉన్నట్లే, భారత్‌కు కూడా తన ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశాల మధ్య సమానమైన ప్రమాణాలు ఉండాలి. ఆంక్షలు న్యాయబద్ధమైన లక్ష్యాలతో, స్థిరమైన విధానంతో అమలు కావాలి.

శక్తిమంతమైన దేశాలు తమకు అనుకూలంగా నియమాలను మార్చుకుంటూ, ఇతర దేశాలకు మాత్రం నీతిపాఠాలు చెప్పడం అంతర్జాతీయ సహకారానికి మేలు చేయదు. ప్రపంచానికి కావలసింది బలవంతుడి నిర్ణయమే న్యాయం అనే వ్యవస్థ కాదు; అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ఆర్థిక అవసరాలను, సమాన హక్కులను గౌరవించే అంతర్జాతీయ వ్యవస్థ. ట్రంప్ రష్యా డీజిల్ నిర్ణయం ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. అమెరికా ప్రయోజనమే జాతీయ ప్రయోజనమైతే, భారత ప్రయోజనం కూడా జాతీయ ప్రయోజనమే. ఈ సత్యాన్ని ప్రపంచం గుర్తించాలి.

# కళ్లు మూసుకున్న టీవీ ఛానళ్లు

కాక్రోచ్ జనతా పార్టీ ఆరంభం నుండి దాని కార్యక్రమాల ప్రసారాలపై మన టీవీ ఛానళ్లు దూరంగా ఉంటున్నాయి. గత 12 ఏండ్లుగా దేశంలో ప్రధాని మోడీకి, ఆయన పాలనను ఎదురులేని కాలం నడుస్తోంది. టీవీ ఛానళ్లు కూడా ఆయన గొప్పలకు బాకాలయ్యాయి. అనూహ్యంగా తమాషా పేరుతో వచ్చిన సిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రత్యేకించి మోడీ, అమిత్ షాలను నిలదీస్తుంటే ఆ వార్తలను మన టీవీ ఛానళ్లు పక్కనబెడుతున్నాయి. 2026 -నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీకి నిరసనగా రెండు నెలల క్రితం తొలిసారిగా సిజెపి ఆందోళన చేపట్టినప్పుడు కూడా ఢిల్లీ పాలకుల పలుకులనే ఇవి ఉచ్ఛరించాయి. వీరి వెనుక విదేశీ శక్తులున్నాయని, వీరి ఉద్యమం దేశ భద్రతకు హానికారకమని కూడా ప్రైమ్‌టైమ్‌లో ఊదరగొట్టాయి. జులై 20న 'సంసద్ చలో' అంటూ సిజెపి పిలుపుపై దేశవ్యాప్తంగా యువత నుంచి వచ్చిన స్పందన ప్రభుత్వాన్నే దిగి వచ్చేలా చేసింది. కేంద్ర విద్యా మంత్రి రాజీనామా ఇవ్వడంతో ఇవే ఛానళ్లు ప్లేటు ఫిరాయించాయి. దేశమంతా వారి ఆందోళనను సమర్థిస్తుంటే, ఇక తప్పదన్నట్లు ఒక్క రోజులో గొంతు మార్చిన టీవీ ఛానళ్లు ఉన్నాయి. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, యువతను తప్పుపడితే ఛానల్ ప్రతిష్ట దెబ్బ తింటుందని, వీక్షకుల దృష్టిలో దోషులుగా మారిపోతామని జాగ్రత్తలు పడ్డాయి. ప్రధాని మోడీకి గట్టి షాక్‌ని ఇచ్చిన కాక్రోచ్ పార్టీ నేతలు 'మా ఉద్యమం



ఇక్కడితో ఆగదు, అడుగడుగునా సర్కారును నిలదీస్తూ, అంతా చక్కదిద్దే దాకా కొనసాగుతుంది' అని ప్రకటించారు. అప్పుడు కూడా ఈ ఛానళ్లు ముందుకొచ్చి సిజెపి నేతలని ఇంటర్వ్యూలు చేయలేదు. వారి కదలికలపై, మాటలపై వచ్చిన రీల్స్ తప్ప ప్రజాస్వామ్య పరిరక్షణలో నాలుగో స్తంబంలో భాగమైన మన దృశ్య ప్రసార మాధ్యమాలు ఆ వైపు వెళ్లలేదు. ఓట్ల సవరణ కోసం ఏర్పడ్డ 'సర్' తప్పిదాల రూపంలో కాక్రోచ్ పార్టీకి మరోసారి కేంద్రాన్ని ప్రశ్నించే అంశం దొరికింది. ఈ నెల పదవ తేదీన వారి నిరసన కోసం ఢిల్లీ, జంతర్ మంతర్‌ను మరోసారి వేదిక చేసుకున్నారు. ఈసారి ఢిల్లీలో సర్కారు ఎన్నడూ లేని ఆంక్షలను విధించింది. ఎన్ని అడ్డంకులు ఏర్పరచినా రకరకాల మార్గాల్లో ఢిల్లీ చేరిన యువజనులు తమ పంతం నెగ్గించుకున్నారనే చెప్పాలి. పదవ తేదీన దేశ రాజధానిలో.. దేశాన్ని అట్టుడుకిస్తున్న సమస్యపై యువత చేపట్టిన ఆందోళన, దానిని ప్రభుత్వం అణచివేసిన తీరును ప్రజలకు చూయించేందుకు టీవీ ఛానళ్లు ఈసారి కూడా ముందుకు రాలేదు. వాటి ప్రాథమ్యాలు వింతగా ఉంటాయి. అనుకోకుండా ఒక కోతి గుడిలో కనిపిస్తే అదో సంచలనం. నాలుగు సినిమా క్లిప్పింగ్స్ కలిపి ఓ కట్టుకథను అల్లి అద్భుత విషయంగా ప్రసారం చేయడమంటే మన టీవీలకు ఎంతో ఇష్టం. ఒక ఇంట్లోంచి రాత్రి విచిత్ర శబ్దాలు వస్తే అది ప్రైమ్‌టైమ్ కంటెంట్. శాస్త్రీయ రుజువులతో భయాన్ని పోగొట్టే కన్నా ఏవేవో క్షుద్ర వీడియో ముక్కలను చూయించి లేని భయాన్ని, మూఢనమ్మకాల్ని పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. యువత చేపట్టిన ఆందోళన కన్నా నాలుగు రోజుల ముందు అనగా ఇదే నెల 6న రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలతో కలిసి ఇదే 'సర్' సమస్యపైనే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫీసు ముట్టడికి బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డగించడంతో దినమంతా ఆకాశవాణి భవన్‌లో చెట్ల కింద కూచున్నారు. సాయంత్రం పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేసి తర్వాత వదిలిపెట్టారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర...

**13 మంది పోటు వర్కర్ సీనియర్లకు పదోన్నతులు, 45 మందికి కారుణ్య నియామకాలు అభినందనీయం --- అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల. కిరణ్...**

**తిరుపతి ఉత్తేజిత అక్టోబర్ 14.**



టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ఎన్నో సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 13 మంది పోటు వర్కర్ సీనియర్లకు పోటు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించడం, అదేవిధంగా కుటుంబ పెద్దలను కోల్పోయి కష్టాల్లో ఉన్న 45 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర కి ఆయన ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన అభ్యర్థనలను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపడం బాధ్యతాయుతమైన పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఎన్నో సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 13 మంది పోటు వర్కర్ సీనియర్లకు పదోన్నతులు కల్పించడం ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, వారి సేవలకు తగిన గుర్తింపు లభించినట్లవుతుందని చీర్ల కిరణ్ తెలిపారు. ఈ పదోన్నతులు శ్రీవారి ప్రసాదాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత, పర్యవేక్షణ ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అదేవిధంగా, కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 45 కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు లభించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలు ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపుతాయని అన్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

"కారుణ్య నియామకం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు... కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొండంత భరోసా, కన్నీళ్ల మధ్య చిగురించే కొత్త ఆశ. మీకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, మీ కుటుంబాలకు అండగా నిలవాలి. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ భక్తులకు నిస్వార్థ సేవలందించి టీటీడీ కీర్తి ప్రతిష్ఠలను మరింత పెంచాలి" అని చీర్ల కిరణ్ సూచించారు.

టీటీడీ ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, మానవతా దృక్పథంతో నిర్ణయాలు తీసుకుంటున్న ఈవో ముద్దాడ రవిచంద్ర కృషి అభినందనీయమని ఆయన అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా నిలిచే విధంగా తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగుల్లో నమ్మకాన్ని, సంస్థ పట్ల బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు.

ఈ సందర్భంగా పదోన్నతుల ప్రక్రియలో చొరవ చూపి సహకరించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర కి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి కి, జేఈవోలు డాక్టర్ ఎ. శరత్ కి, ప్రభల గోపినాథ్ గారికి, సీవీఎస్ఓ మురళీకృష్ణ కి, టీటీడీ పాలకమండలి సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

అలాగే 45 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రక్రియలో సహకరించిన అదనపు ఈవో కి, జేఈవోలకు, సీవీఎస్ఓ కి, సంబంధిత అధికారులందరికీ టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమం, పదోన్నతులు, కారుణ్య నియామకాలు, న్యాయమైన సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో టీటీడీ యాజమాన్యం ఇదే సానుకూల దృక్పథాన్ని కొనసాగించాలని చీర్ల కిరణ్ ఆకాంక్షించారు.

ఉద్యోగుల అభ్యున్నతికి, వారి కుటుంబాల సంక్షేమానికి కృషి చేసే యాజమాన్యానికి తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

పదోన్నతులు పొందిన 13 మంది పోటు వర్కర్ సీనియర్లకు, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన 45 మంది అభ్యర్థులకు మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, అందరూ అంకితభావంతో విధులు నిర్వహించి శ్రీవారి సేవలో, టీటీడీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చీర్ల కిరణ్ ఆకాంక్షించారు.

# గోనెగండ్లలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల నిరసన

**గోనెగండ్ల,ఉత్తేజిత న్యూస్ :-అక్టోబర్ 14:**





ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తూ రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ పిలుపుమేరకు గోనెగండ్ల మండలంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ సభ్యులు దండు ఖాజా, గోనెగండ్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు ఖాసింవలి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పాత్రికేయులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. అక్రమ ఓటర్ల జాబితాపై కవరేజీకి వెళ్లిన వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువీరకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు రుద్ర, ప్రధాన కార్యదర్శి జయన్న, సభ్యులు గజేంద్రారెడ్డి, అహ్మద్ హుస్సేన్,సుభాన్, భాష,శ్రీనివాసులు, మునెప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

# కరివేన గ్రామంలో జిల్లా మలేరియా అధికారి ఆకస్మిక తనిఖీ

**ఆత్మకూరు ఉత్తేజిత**

**జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి -- పరిసరాల పరిశుభ్రత పాటించాలి**



ఆత్మకూరు : బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరివేన గ్రామంలో జిల్లా మలేరియా అధికారి శ్రీ చంద్రశేఖర రావు గారు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించి, గ్రామంలో జ్వరాల పరిస్థితిపై ఆరోగ్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

అనంతరం గ్రామంలోని ఫైలేరియా బాధితుడిని సందర్శించి, వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీ చంద్రశేఖర రావు గారితో పాటు ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, విశ్వనాథ్, శారద, లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# .4 వార్డులగాను.. 1 వార్డు కేటాయించడం ఎస్సీల మనోభావాలు దెబ్బతీయడమే

**ఆత్మకూరు ఉత్తేజిత**

**(మాల మహానాడు) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు మాల మహానాడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించడమైనది**

**ఆత్మకూరు :-**



మున్సిపల్ పరిధిలోని వార్డు రిజర్వేషన్లలో ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరిగిందంటూ దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బుధవారం నాడు అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాల మహానాడు నాయకులు పెరుమాల చెన్న కేశవులు, మురహరి మల్లయ్య , సగినాల రవికుమార్ ,మేకల సుధాకర్, అబ్రహం , మొదలగు వారు మాట్లాడుతూ, గతంలో 2021 నాటి స్థానిక సంస్థల ఎన్నికల సమయములో 24 వార్డులు ఉన్న మున్సిపాలిటీ పరిధిలో, నాలుగు వార్డులు ఎస్సీలకు రిజర్వ్ చేశారు. ఈసారి మున్సిపాలిటీ పునర్విభజన కింద వార్డుల సంఖ్య 32 కు పెరిగాయి. కానీ ఎస్సీ వర్గానికి మాత్రం రిజర్వేషన్ వార్డుల సంఖ్య పెంచకపోగా, ప్రస్తుతం ఉన్న నాలుగు వార్డుల రిజర్వేషన్ సంఖ్య తగ్గిస్తూ, కేవలం ఒక్క వార్డుకే పరిమితం చేయడం పట్ల దళిత సంఘాల నాయకులు తీవ్రత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అంశాన్ని ఎస్సీ నాయకులు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని యోచనలో ఉన్నారని తెలిపారు. సాధారణంగా అటు సార్వత్రిక ఎన్నికల్లోను, ఇటు స్థానిక సంస్థల ఎన్నికల లోను, ఎస్సీల ఓట్లు గణనీయంగా ఉంటుందని, ఆయా రాజకీయ పార్టీల గెలుపు విషయంలోనూ ఎస్సీల ప్రభావము ఉంటుందని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ రిజర్వేషన్ల ప్రక్రియలో ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరిగిందంటూ,

మరొకసారి పునః పరిశీలించి ఎస్సీలకు న్యాయం చేయాలంటూ, మాల మహానాడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బేబీకి వినతిపత్రం సమర్పించడమైనది. ఈ కార్యక్రమంలో జి రాఘవేంద్ర,ఎస్ నాగరాజు, జయన్న, యేసురత్నం, సతీష్ కుమార్, మొదలగు వారు పాల్గొన్నారు

# మూడు రోజుల్లో ఈ-పంట ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

**ఆత్మకూరు ఉత్తేజిత**



రైతులకు మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచనకొత్తపల్లి : రైతులందరూ మూడు రోజుల్లో ఈ-పంట ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు. ఈ-పంట ఈకేవైసీ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హత ఉంటుందని ఆమె తెలిపారు.

ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులందరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది లేదా రైతు సేవా సిబ్బందిని సంప్రదించి ఓటీపీ లేదా ఆధార్ ఫేస్ ఆథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చని వివరించారు. అలాగే రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఈ-పంట అధికారిక వెబ్‌సైట్??లో ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.

కావున రైతులందరూ గడువులోగా ఈ-పంట ఈకేవైసీ పూర్తి చేసుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు.

# ఆత్మకూర్ పట్టణాభివృద్ధి రాజన్నకే సాధ్యం:: సింగల్ విండో చైర్మన్ షహబుద్దిన్.

**ఆత్మకూరు :**



శ్రీశైలం శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి గారి ఆదేశాలతో ఈరోజు ఆత్మకూర్ మున్సిపాలిటీ లోని పలు ప్రాంతాల్లో మీూా గారి ప్రత్యేక నిధుల ద్వారా దాదాపు మూడు కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీమతి బేబీ గారు మరియు ఆత్మకూర్ పట్టణ అధ్యక్షులు శ్రీ వేణుగోపాల్ గారితో కలిసి పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దీన్ . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణాభివృద్ధి శ్రీశైలం శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి గారికే సాధ్యమన్నారు. దీనిని పట్టణ ప్రజలు ఆలోచించి రేపు జరుగు స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి ఇంకా ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా పురం బాషా, క్లస్టర్ ఇంచార్జ్ శంకర్, వార్డు అధ్యక్షులు హాశం, వలి ఖాన్, రమణ, కోయ మున్నా, కిరణ్, ఖాజావలి, ఖాజా, రహిమాని, టపాల్ అష్రఫ్ అలీ, లియా హత్ అలీ, సలాం, శ్రీను, మా భాష, అస్గర్, మాలిక్ మున్సిపల్ కాంట్రాక్టర్లు ఉపేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లతో ఊపందుకున్న రాజకీయాలు!

**- బేతంచెర్లలో ఆశావాహుల హడావుడి.. అభ్యర్థుల ఎంపికపై పార్టీల దృష్టి**




**బేతంచెర్ల: ఉత్తేజిత ప్రతినిధి** : నగర పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో బేతంచెర్లలో రాజకీయాలు ఊపందుకున్నాయి. చైర్‌పర్సన్ పదవితో పాటు వార్డుల రిజర్వేషన్లు వెలువడటంతో వివిధ పార్టీల నాయకులు ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా ఉండటంతో పలువురు ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయా పార్టీల నాయకులు వార్డుల వారీగా బలాబలాలను అంచనా వేస్తూ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. టికెట్లు ఆశిస్తున్న నాయకులు ముఖ్య నేతలను కలిసి తమ అభ్యర్థిత్వానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లోఉన్నారు. మరోవైపు,స్థానిక సమస్యలు,ప్రజలతో ఉన్న సంబంధాలు,పార్టీ బలాబలాలు ఎన్నికల్లోకీలకంగా మారనున్నాయి. రిజర్వేషన్ల ప్రకటనతో బేతంచెర్లలోఎన్నికల సందడి మొదలవగా,రానున్న రోజుల్లో రాజకీయ పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.




# బేతంచెర్లలో ఎన్నికల సందడి.. 28 వార్డుల్లో పోటీకి నేతల సై!

**బేతంచెర్ల: ఉత్తేజిత ప్రతినిధి** :మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో బేతంచెర్ల నగర పంచాయతీలో ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల16 నుంచి18 వరకు నామినేషన్ల స్వీకరణ,28న పోలింగ్, 30న ఫలితాల ప్రకటన జరగనుంది. నగర పంచాయతీ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించారు. బేతంచెర్ల నగర పంచాయతీలోమొత్తం28 వార్డులు ఉండగా, 31,285 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,126 మంది పురుషులు,16,143 మంది మహిళలు,16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 56 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. నోటిఫికేషన్ విడుదలతో ఆశావహులు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలుపై దృష్టి సారించారు.

# శ్రీకాళహస్తి నూతన డీఎస్పీ పావనిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు..

**?శ్రీకాళహస్తి ఉత్తేజిత అక్టోబర్ 14.**



శ్రీకాళహస్తి సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావనిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

?ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు ముఖ్యమైన ప్రజా సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోయాయని, దీనివల్ల విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, స్వర్ణముఖి కట్ట ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని తెలిపారు.

?కాంగ్రెస్ నేతలు వివరించిన సమస్యలపై డీఎస్పీ పావని సానుకూలంగా స్పందించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని, ఆకతాయిల ఆగడాలకు మరియు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు.

?ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధా యాదవ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీతో పాటు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారథి, చిరంజీవి తదితరులు

ఉత్తేజిత దినపత్రిక


# దారి వివాదంలో రెవెన్యూ శాఖ అత్యుత్సాహం..

**రామకృష్ణాపురంలో బాధితులపై బూటుకాళ్ల దాడి**

**మహిళలు, దివ్యాంగుడనీ చూడకుండా దురుసు ప్రవర్తన.. జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకోవాలన్న సీపీఎం నేతలు**





**రేణిగుంట, అక్టోబర్ 14, ఉత్తేజిత,**

ప్రత్యేక ప్రతినిధి బంధువుల మధ్య ఏర్పడిన చిన్నపాటి వీధి దారి వివాదంలో రాజకీయాలు జోక్యమై, చివరకు రెవెన్యూ పోలీసుల దౌర్జన్యానికి దారితీసిన ఘటన రేణిగుంట మండలం రామకృష్ణాపురంలో తీవ్ర కలకలం రేపింది. గోటితో పోయే సమస్యను గొడ్డలి దాకా తెచ్చి, అమాయకులపై పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారంటూ స్థానికంగా నిరసన వ్యక్తమవుతోంది. బాధితులపై పోలీసులు దాడి చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రామకృష్ణాపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రమేష్, ఆయన భార్య చాముండేశ్వరి, ఆశా వర్కర్, కుటుంబం గత 20 ఏళ్లుగా రేకుల ఇంట్లో నివాసముంటోంది. వారి ఇంటి ముందున్న సుమారు ఒక సెంటు డీకేటీ స్థలంలో చెట్లు నాటి, చిన్న పిట్టగోడ నిర్మించుకున్నారు. అయితే, స్థానిక తెలుగుదేశం పార్టీ నేతల ఒత్తిళ్లతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం రెవెన్యూ యంత్రాంగం, స్థానిక ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలోని పోలీసు బలగాలు జేసీబీతో ఆ స్థలంలోని చెట్లు, గోడను తొలగించేందుకు రంగంలోకి దిగాయి.

రెవిన్యూ పోలీసుల అత్యుత్సాహం.. అమానుషం..

తమ స్థలాన్ని కూల్చవద్దని అడ్డుకోబోయిన రమేష్, ఆయన భార్య చాముండేశ్వరి, అలాగే ఇంట్లోని దివ్యాంగుడైన సురేష్ పై పోలీసులు దౌర్జన్యానికి దిగారు. మహిళలు, దివ్యాంగుడనే కనికరం కూడా లేకుండా వారిని నేలపై ఈడ్చిపడేసి, బూటు కాళ్లతో తన్నుతూ అమానుషంగా ప్రవర్తించారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.

**బాధితులకు ప్రజా సంఘాల బాసట...**

విషయం తెలుసుకున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ సిపిఎం మండల కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ సిఐటియు నేత సెల్వరాజ్ ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత హరినాథ్ మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలగి రెవిన్యూ పోలీస్ యంత్రాంగం చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం గర్హనీయమని మండిపడ్డారు. బాధితులపై డిప్యూటీ తాసిల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులు సైతం మహిళలని వికలాంగుడని చూడకుండా
అసభ్యంగా మాట్లాడడం, అలాగే బాధితులపై బూటు కాళ్లతో దాడి చేసిన పోలీసులపై ఏకపక్షంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ ఎస్పీలు తక్షణమే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతలకు అండగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.




# బేతంచెర్ల మండల ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు

**బేతంచెర్ల: ఉత్తేజిత ప్రతినిధి** :మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు వెల్లడయ్యాయి.ఎస్సీ మహిళలకు అంబాపురం, గోర్లగుట్ట,ఎస్సీ జనరల్ కు ఎం.పెండేకల్,సీతారాంపురం కేటాయించారు.బీసీ మహిళలకు సిమెంట్ నగర్-1,ఎంబాయి;బీసీ జనరల్‌కు సిమెంట్ నగర్-2, హెచ్.కొట్టాల
కేటాయించారు.అన్‌రిజర్వ్‌డ్ మహిళలకు గోరుమానుకొండ,గూటుపల్లి, కొత్తపల్లి,ఎస్.రంగాపురం-2,అన్‌రిజర్వ్‌డ్ జనరల్‌కు కొలుములపల్లి,ముద్దవరం, రంగాపురం-1 కేటాయించారు.రిజర్వేషన్ల వివరాలు వెల్లడికావడంతో స్థానిక ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# స్థానిక సంస్థల రిజర్వేషన్లు కేటాయింపు...

:- ఎంపీటీసీ,జడ్పిటిసి,ఎంపీపీల రిజర్వేషన్లు విడుదల.

**ఉత్తేజిత ప్రతినిధి....నందికొట్కూర్ అక్టోబర్ 14**




: మండలంలోని స్థానిక సంస్థల రిజర్వేషన్లను బుధవారం జిల్లా కలెక్టర్ మరియుఎన్నికల అధికారి రాజకుమారి గలియా రిజర్వేషన్లు విడుదల చేశారు. నందికొట్కూరు మండల జిల్లా ప్రాదేశిక సభ్యుడు (జడ్పిటిసి )స్థానాన్ని బీసీ జనరల్ కు కేటాయించగా, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించడం జరిగింది. అలాగే మండలంలోని 11 గ్రామాలలోని ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు విడుదల చేశారు. శాతనకోట ( అన్ రిజర్వుడు),మల్యాల (బీసీ మహిళ), నాగటూరు (అన్ రిజర్వుడు), కొనిదేల (బీసీ మహిళ),అల్లూరు (బీసీ ),వడ్డేమాన్ (అన్ రిజర్వ్), కోనేటమ్మపల్లి (ఎస్సీ మహిళ), బ్రాహ్మణ కొట్కూర్ -1( అన్ రిజర్వుడు మహిళా) బ్రాహ్మణ కొట్టు 2-(అన్ రిజర్వ్ మహిళ), దామగట్ల (ఎస్సీ మహిళ ),10-బొల్లవరం (ఎస్సీ) ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను విడుదల చేశారు. ఈ ఎన్నికలలో జిల్లా పరిషత్ చైర్మన్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ )ల ను నేరుగా ప్రజలే ఓట్లు వేసి ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లా ప్రాదేశిక సభ్యుడు( జడ్పిటిసి ),మండల ప్రాదేశిక సభ్యుడు( ఎంపీటీసీ )లకు ఓట్లు వేసి ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

# బేతంచెర్ల మండల సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు

**బేతంచెర్ల: ఉత్తేజిత ప్రతినిధి**




:మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచి స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రిజర్వేషన్ల వివరాలు వెల్లడికావడంతో స్థానిక ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.అంబాపురం--ఎస్సీ జనరల్, గోర్లగుట్ట--అన్‌రిజర్వ్‌డ్,ఎం.పెండేకల్--అన్‌రిజర్వ్‌డ్, సీతారాంపురం--ఎస్సీ మహిళ, సిమెంట్ నగర్--బీసీ మహిళ,ఎంబాయి--ఎస్సీ మహిళ, హెచ్.కొట్టాల--అన్‌రిజర్వ్‌డ్, గోరుమానుకొండ--అన్‌రిజర్వ్‌డ్ మహిళ, గూటుపల్లి--అన్‌రిజర్వ్‌డ్,ఆర్.కొత్తపల్లి--అన్‌రిజర్వ్‌డ్,ఆర్.ఎన్.రంగాపురం--బీసీ మహిళ,కొలుములపల్లె--అన్‌రిజర్వ్‌డ్ మహిళ,ముద్దవరం--అన్‌రిజర్వ్‌డ్ మహిళ, ఆర్.బుక్కాపురం--అన్‌రిజర్వ్‌డ్ మహిళ, బుగ్గనపల్లె తాండ--ఎస్టీ,శంకలాపురం--బీసీ జనరల్,రహిమాన్‌పురం--బీసీ జనరల్,కేకే కొట్టాల--బీసీ మహిళ,తవిసికొండ--ఎస్సీ జనరల్‌గా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

రిజర్వేషన్ల ప్రకటనతో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులను ఆశిస్తున్న నాయకులు ఎన్నికల సన్నద్ధతపై దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి.

# శ్రీశైలంలో నీళ్లున్నా సాగునీరు బంద్ ఎందుకు?

:ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలి

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు, అక్టోబర్ 14:**




శ్రీశైలం జలాశయంలో 840 అడుగుల నీటిమట్టం ఉన్నందున ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి రైతుల ఆరుతడి పంటలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు అందించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నందికొట్కూరులోని అల్లూరు రోడ్డులో ఉన్న వినోద్ మిశ్రా కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐ షేక్ బాషా, జూనియర్ అసిస్టెంట్ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు కనీసం రబీ సీజన్‌లోనైనా సాగునీరు అందించాలని కోరారు. పది రోజులకు ఒకసారైనా కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తే ఆరుతడి పంటలకు మేలు జరగడంతోపాటు నందికొట్కూరు పట్టణం, పరిసర గ్రామాల తాగునీటి అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు.గత ఏడాది శ్రీశైలం జలాశయంలో 860 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడే నీటిని విడుదల చేసిన అధికార పార్టీ నాయకులు, ఈ ఏడాది రైతుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసీ కెనాల్‌కు వెంటనే నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. బీబీ, బి. లక్ష్మీదేవి, షేక్ నవ్యసాని, గుంపుల త్యాగరాజు, పిక్కిలి మాధవ నాయుడు, శివకుమార్, రైతు సంఘం జిల్లా నాయకుడు వడ్డే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడి ఇంటిపై దౌర్జన్యం.. డీఎస్పీకి ఫిర్యాదు..

**నోటీసులు లేకుండానే ప్రహరీ గోడ కూల్చివేత**

**అడ్డుకోబోయిన దివ్యాంగుడిపై కానిస్టేబుల్ దాడి ఆరోపణ**

**బాధితుడికి అండగా నిలిచిన వికలాంగుల జేఏసీ**





రేణిగుంట: అక్టోబర్ 14, ఉత్తేజిత, ప్రత్యేక ప్రతినిధి ముందస్తు సమాచారం, ఎలాంటి నోటీసులు లేకుండా అధికారులు తమ ఇంటి ప్రహరీ గోడను జేసీబీతో కూల్చివేసి, ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారంటూ ఓ దివ్యాంగుడు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావును ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకున్నాడు. బాధితుడికి మద్దతుగా వికలాంగుల జేఏసీ నాయకులు డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు.

?బాధితుడు వి. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... రేణిగుంట మండలం, గురవరాజుపల్లి పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురంలో ఇంటి నెం. 5-103 నందు తమ కుటుంబం గత 45 ఏళ్లుగా నివాసముంటోంది. అయితే, ఇంటి సమీపంలో ఉండే కొందరు వ్యక్తులు అధికార పార్టీ అండదండలతో తమ ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

?ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది తమ ఇంటి వద్దకు చేరుకుని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జేసీబీ యంత్రంతో

ప్రహరీ గోడతో పాటు కొబ్బరి, నేరేడు చెట్లను నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తూ జీవిస్తున్నామని, నోటీసు చూపించాలని నిలదీయగా.. వికలాంగుడినని కూడా చూడకుండా పోలీసు కానిస్టేబుల్ తన చొక్కా చింపి, నెట్టివేయడంతో కిందపడి నడుముకు బలమైన గాయమైందని బాధితుడు కన్నీటిపర్యంతమయ్యాడు.

?అధికారాన్ని అడ్డం పెట్టుకుని దివ్యాంగుల కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడిన అధికారులు, ప్రోత్సహించిన వ్యక్తులపై దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, దివ్యాంగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్చార్జ్ మురళి గౌడ్ సభ్యులు మధులత సురేంద్ర హేమంత్ కుమార్ అనూష తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరులో రూ.21 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి

**:9.70 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు..**

**మూడు పార్కుల ఆధునికీకరణ**

**అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు, అక్టోబర్ 14:**



నందికొట్కూరు పురపాలక సంఘం పరిధిలో పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో రూ.21 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య శ్రీకారం చుట్టారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలో నిర్వహించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు, నూతన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలో 9.70 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.17.50 కోట్లు, మూడు పార్కుల అభివృద్ధికి రూ.3.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.మొత్తం రూ.21 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించనున్నాయి.ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యంఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు సేదతీరేందుకు పార్కులను అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.నాణ్యమైన సీసీ రోడ్లు, ఆధునిక సౌకర్యాలతో పార్కుల అభివృద్ధి ద్వారా పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.నందికొట్కూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పాత రోజులంటే పాలమూరు నుంచి వలసలేనా..?

ధరూరు, గట్టు,కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తీసుకొస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. పాలమూరు ప్రజలను వలసలు పంపుతూ ఇచ్చిన మాటను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గద్వాల నియోజకవర్గం గట్టు మండలం ఇందువాసిలో వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు మృతిచెందగా.. బాధిత కుటుంబాలను హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టి రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం కారణమవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు గ్రహణం పట్టిందని ఆరోపించారు. జూరాలకు రెండు వందల టీఎంసీలకుపైగా వరద వచ్చినా.. ఎత్తిపోయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఓ పక్క మన జలాశయాలు వెలవెలబోతుంటే ఏపీలో నిండుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏపీకి మేలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఓ వైపు పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీలో కుప్పం వరకు నీరు పారిస్తుంటే.. కృష్ణా, తుంగభద్రల నడుమ ఉన్న పాలమూరు రైతులు పంటలను ఎండబెట్టుకునే పరిస్థితి కల్పించారన్నారు. వచ్చే యాసంగిలో పంటలు సాగు చేయవద్దని చెప్పడమంటే.. ప్రభుత్వ చేతకాని తనంకాక ఇంకేమిటని ప్రశ్నించారు. జలవిద్యుత్తు పూర్తిగా నిలిచిపోగా.. థర్మల్ విద్యుత్తుకు బొగ్గు కూడా సరఫరా చేయలేక సర్కారు చతికిలపడిందన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రెస్ మరీ బ్యాడ్ కాదు గురూ...

రోజూ ఇంట్లో, ఆఫీసులో ఎన్నో పనులు. ఎన్నో సమస్యలు, సవాళ్లు. మరెన్నో ఆటుపోట్లు. వీటన్నింటినీ ఎదుర్కొనే క్రమంలో కొంత మెంటల్ స్ట్రెస్ ఉంటుంది. రోటీన్‌లైఫ్‌లో ఎంతో కొంత స్ట్రెస్ సహజం. ఇది ఎక్కువైతే రకరకాల అనారోగ్య సమస్యలు మొదలవుతాయి. స్ట్రెస్ అంతా చెడ్డదేమీ కాదు. సానుకూల ప్రభావమూ చూపుతుంది. దీన్నే యూస్ట్రెస్ అని పిలుచుకుంటారు. అంటే మంచి ఒత్తిడి. ఉత్సుకత, అనూహ్య ఘటనలు, ప్రమాదాల వంటివి శరీరంలో రసాయన ప్రతిస్పందనలను ప్రేరేపిస్తాయి. మంచి ఒత్తిడికీ ఇవే కారణం. వినోదాత్మక సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు నాడుల స్పందనలో భాగంగా పుట్టుకొస్తుంది. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే మంచి ఒత్తిడి లేకపోతే హాయిగా జీవించలేం. మనం చురుకుగా, ఉత్సాహంగా ఉండటానికి.. లక్ష్యాలను అందుకోవటానికి.. జీవితం పట్ల సానుకూలంగా ఉండటానికి.. తృప్తి కలగటానికిది దోహదం చేస్తుంది. దీంతో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. సెల్ఫ్ కాన్ఫిడెన్స్, ఇండిపెండెంట్ ఫీలింగ్, ధైర్యం పెంపొందుతాయి. వ్యాయామం వంటి వాటిని కొనసాగించేలా చేయటం ద్వారా శారీరక ఆరోగ్యానికీ దోహదం చేస్తుంది. మంచి ఒత్తిడిని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం.



## మంచి టార్గెట్స్ ఉన్నప్పుడు..

ఉద్యోగం దగ్గరి నుంచి వ్యక్తిగత సంబంధాలు, ఇల్లు, కుటుంబం, అన్యోన్యత, అవకాశాల వరకూ అన్నింటిలోనూ ఇది ఇమిడి ఉంటుంది. ఉదాహరణకు.. ఆఫీసులో కొత్త ప్రాజెక్టును పొందారనుకోండి. మంచి ఒత్తిడి దాన్ని సాధించటానికి బలాన్నిస్తుంది. నైపుణ్యాలను సజావుగా వాడుకోవటానికి, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటానికి ఉత్సాహం చూపేలా చేస్తుంది. అయితే ఇలాంటి ప్రాజెక్టులు వాస్తవికమైనవి అయితేనే మంచి ఒత్తిడికి దారితీస్తాయి. అదే లక్ష్యాలు అసంబద్ధంగా ఉన్నప్పుడు, తలకు మించిన ప్రాజెక్టులు చేపట్టినప్పుడు, పని భారం పెరిగినప్పుడు, తోటి ఉద్యోగులు సహకరించనప్పుడు డిస్ట్రెస్ కారణమవుతుంది. ప్రతికూల పరిణామాలను చూడాల్సి వస్తుంది. మనకు సహజంగానే నేర్చుకునే గుణం ఉన్నప్పటికీ కొత్త విషయాలు అభ్యసించటం, నైపుణ్యం సాధించటం అంత తేలిక కాదు. చిన్న చిన్న విజయాలను సాధిస్తూ వస్తుంటే ఆత్మ విశ్వాసం ఇనుమడిస్తుంది. వాటి నుంచి స్ఫూర్తి పొందుతూ మెరుగు పరచుకోవటానికి దోహదం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందుకు నడిపించేది మంచి ఒత్తిడే. మన సామర్థ్యాన్ని సవాల్ చేసే కఠినమైన వ్యాయామాలూ మంచి ఒత్తిడికి నిదర్శనమని చెప్పుకోవచ్చు. ఇవి కష్టమైనవే అయినా వీటితో ఒనగూరే ప్రయోజనాలు ఉత్సాహాన్ని కలగజేస్తాయి. ఇది శ్రమను మరచిపోయేలా, కొనసాగించేలా చేస్తాయి.



**గుడ్ స్ట్రెస్‌ను తెచ్చుకోవడం ఎలా..**

మనలో మంచి ఒత్తిడి సహజంగానే ఉంటుంది. కానీ దీన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకుంటే మరింత ఫలితం కనిపిస్తుంది. చిన్నదో, పెద్దదో.. రోజూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవాలి. సౌకర్యవంతమైన పరిధిని అధిగమించటానికి ప్రయత్నించాలి. కొత్త బాధ్యతలను స్వీకరించటానికి, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటానికిది తోడ్పడుతుంది. వ్యాయామం చేయటం తప్పనిసరి. ఇది శరీరానికే కాదు, మనసుకూ ఉత్సాహాన్ని కలగజేస్తుంది. సవాళ్లతో కూడిన, సహేతుకమైన లక్ష్యాలను నిర్ణయించుకునే తీరును నేర్చుకోవాలి. సాధిస్తున్న పురోగతిని గమనిస్తూ.. దానికి తామే బాధ్యులమని గుర్తించాలి.

**బ్యాడ్ స్ట్రెస్‌తో డేంజర్..**

సానుకూల ఒత్తిడికి పూర్తి వ్యతిరేకమైంది ప్రతికూల ఒత్తిడి. ఇది మానసికంగానే కాదు, శారీరకంగానూ హాని చేస్తుంది. గడువులోగా పనులు పూర్తి చేయలేకపోవటం, ఆర్థిక సమస్యలు, ఆత్మీయులు దూరం కావటం, నిర్లక్ష్యానికీ వేధింపులకూ గురికావటం, జబ్బులు, గాయాలు, ఉద్యోగాల్లో ఇబ్బందులు, ఇతరుల గురించి బాధపడటం వంటివన్నీ దీనికి ఉదాహరణలే. ఇది కొన్నిసార్లు దీర్ఘకాలంగానూ వేధించొచ్చు. ఫలితంగా నిద్రలేమి, నీరసం, తలనొప్పులు, మూడ్ మారిపోవటం, ఆకలి పెరగటం లేదా తగ్గటం, ఆయాసం, ఛాతీనొప్పులు, అజీర్ణం, నిరుత్సాహం వంటివి తలెత్తుతాయి. అందువల్ల చెడు ఒత్తిడిని వీలైనంత త్వరగా తగ్గించుకోవాలి. హానికర ఒత్తిడి బారినపడటం కన్నా ముందు నుంచే దాన్ని నివారించుకోవటం మేలు. ఇందుకు రోజువారీ జీవితంలో కొన్ని జాగ్రత్తలు మేలు చేస్తాయి ధ్యానం, యోగా, ప్రాణాయామం వంటివి మానసిక ప్రశాంతతను కలగజేస్తాయి. శరీర సంరక్షణ మీద దృష్టి పెట్టాలి. మంచి ఆహారం తినటం, వ్యాయామం చేయటం, కంటి నిండా నిద్రపోవటం ద్వారా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవచ్చు.



**ఎలా బయటపడాలి?**

అన్నీ మన నియంత్రణలో ఉండవనే విషయాన్ని గుర్తించాలి. మార్చటానికి వీల్లేని పరిస్థితుల గురించి అదే పనిగా బాధపడటం కన్నా దాన్నుంచి బయటపడే మార్గాలను వెతకాలి. ఎక్కువ పనుల్లో కూరుకున్నప్పడు, తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పడు అదనపు బాధ్యతలను నిర్వర్తించటం కష్టం. ఇలాంటి వాటిని ఎలా నిరాకరించాలో నేర్చుకోవాలి. మనకు ప్రశాంతత, ఆనందం కలిగించేవారితో.. బాధల్లో తోడుగా ఉండేవారితో.. వ్యావహారిక విషయాల్లో సాయం చేసేవారితో సన్నిహిత సంబంధాలు కలిగుండాలి. నమ్మకమైన స్నేహితులు, కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగుతో మనసును బాధిస్తున్న విషయాలను చెప్పుకోవాలి. దీంతో మనసు తేలికపడుతుంది. ఒత్తిడి దరిజేరదు. ఒత్తిడి లక్షణాలు కనిపించినప్పడు వ్యాయామం చేయటం మంచిది. కొద్దిసేపు నడిచినా మూడ్ మెరుగవుతుంది.



# వృద్ధాప్యంలో గురక.. ఫిట్స్‌కు దారి తీస్తుందా?

ఫిట్స్(మూర్ఛ వ్యాధి) చాలావరకూ చిన్న వయసులోనే మొదలవు తుంటుంది. కానీ ఇది జీవితంలో ఎప్పుడైనా తలెత్తొచ్చు. కొందరికి 60 ఏళ్ల తర్వాతా తొలిసారిగా వస్తుంటుంది. అందుకే దీన్ని ఆలస్యంగా మొదలయ్యే ఫిట్స్‌గా భావిస్తుంటారు. పెరాలసిస్, హై బీపీ, మెదడులో కణితి వంటి రకరకాల అంశాలు దీనికి కారణం కావొచ్చు. అయితే, గురకనూ తక్కువగా తీసుకోవటానికి వీల్లేదని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. 60 ఏళ్ల తర్వాత తొలిసారి మూర్ఛ రావటానికీ.. నిద్ర పోతున్నప్పుడు కాసేపు శ్వాస ఆడకపోవటం (స్లీప్ అప్నియా), రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటానికీ సంబంధం ఉంటున్నట్టు తేలటమే దీనికి కారణం. నిద్రలో కొందరికి గొంతు వెనకాల భాగం వదులై శ్వాస మార్గానికి అడ్డుతగులుతుంది. దీంతో శ్వాస ఆగుతుంది. అప్పుడు రక్తంలో ఆక్సిజన్ తగ్గటం వల్ల ఉక్కిరిబిక్కిరై బిగ్గరగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారు. నిద్రమత్తులో ఉండటం వల్ల ఈ విషయం మనకు తెలియదు. కానీ రాత్రంతా చాలాసార్లు ఇలా జరుగుతూనే ఉంటుంది. ఇది రకరకాల సమస్యలకు దారితీస్తుంది. వృద్ధాప్యంలో ఫిట్స్‌కూ కారణమవుతున్నట్టు ఇప్పుడు బయటపడింది. నిద్ర పోతున్నప్పుడు కాసేపు శ్వాస ఆగిపోయేవారికి రెండింతలు ముప్పు పెరుగుతున్నట్టు వెల్లడైంది. అదే రక్తంలో ఆక్సిజన్ 80శాతం కన్నా తక్కువకు పడిపోయిన వారికైతే మూడింతలు ఎక్కువగా ముప్పు పొంచి ఉంటున్నట్టు తేలింది. దీర్ఘకాలంగా నిద్రలో ఆక్సిజన్ శాతం తగ్గుతూ వస్తుంటే మెదడులో మార్పులు తలెత్తే అవకాశముందని, ఇది ఫిట్స్ ముప్పు పెరిగేలా చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. స్లీప్ అప్నియా చికిత్స లేదా నివారణతో ఫిట్స్ వచ్చే అవకాశం తగ్గుతుందో లేదో అనేది అధ్యయనంలో నిర్ధారణ కాలేదు. కానీ ఫిట్స్ ముప్పును తగ్గించుకోవటానికి దీన్ని ముఖ్యమైన అంశంగా పరిగణించొచ్చని సూచిస్తోంది. నిద్ర సమస్యలు, వృద్ధాప్యంలో వచ్చే ఫిట్స్‌కు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవటానికి ఈ అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని.. మెరుగైన చికిత్సల రూపకల్పనకు దారి తీయగలవని ఆశిస్తున్నారు. వృద్ధాప్యంలో ఆరంభమయ్యే ఫిట్స్ సమస్య ఇటీవల ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కొత్త ఆశలు కల్పిస్తోంది.



# పచ్చిమిరప పొడి.. ఆ టేస్టే వేరు

కూర, చారు, రోటిపచ్చడి.. దేనికైనా పచ్చిమిరపకాయలతోనే మంచి ఫ్లేవర్, కమ్మదనం వస్తాయి. అవి లేకుండా వంట అంటే కొంచెం వెలితిగానే ఉంటుంది. కానీ.. ఒక్కో సీజన్‌లో ఇవంతగా దొరకవు లేదా త్వరగా పాడైపోతుంటాయి. అలాంటప్పుడు పచ్చిమిరప కారం వేశామనుకోండి.. చక్కటి రుచీ, పరిమళం. ఎండు మిర్చితోనే కాదు, పచ్చి మిరప కాయలతోనూ కారం చేయొచ్చు. ఎలాగంటే.. ముందుగా నాణ్యమైన, తాజా కాయలను ఎంచుకోవాలి. తొడిమెలు తీసి.. కడిగి, తడి లేకుండా తుడవాలి. ఒక్కో మిర్చినీ నాలుగు చీలికలు చేయాలి. అన్నీ పూర్తయ్యాక.. ట్రేలో లేదా శుభ్రమైన వస్త్రం మీద పల్చగా ఆరబోసి ఎండబెట్టాలి. మూడు రోజుల పాటు పగలు ఎండలో, రాత్రి లోనికి తెచ్చి ఫ్యాన్ కింద ఎండబెట్టాలి. ఈ కాయలను తుంచితే.. సాగకుండా విరిగినట్లయితే చక్కగా ఎండినట్లు. వీటిని మెత్తగా గ్రైండ్ చేస్తే సరి.. పచ్చిమిర్చి కారం సిద్ధం. ఈ కారాన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే సంవత్సరం పాటు నిలవుంటుంది. పచ్చిమిరపకాయలకు బదులుగానే కాదు.. కూరల్లో కారానికి బదులు ఇది వాడుకోవచ్చు.

# రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం

**కల్యాణి, అక్టోబరు 13 :** బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు



వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అదే సమయంలో జస్‌ప్రీత్



బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

**గువాహటి, అక్టోబరు 13 :** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

## షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

## అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

## రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

## సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.









# ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

**దుబాయ్, అక్టోబరు 13 :** భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

**దుబాయ్, అక్టోబరు 13:** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.





# అందంతో కట్టిపడేస్తున్న టాలీవుడ్ బుట్టబొమ్మ..

## పూజా హెగ్డే బర్త్‌డే స్పెషల్!

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే తన పుట్టినరోజును ఎంతో వేడుకగా జరుపుకుంటున్నారు. టాలీవుడ్ నుంచి కోలీవుడ్, బాలీవుడ్ వరకు తన అందం, అద్భుతమైన నటనతో మిలియన్ల మంది అభిమానుల మనసులను గెలుచుకున్న ఈ భామకు సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో బ్లూ అండ్ వైట్ డ్రెస్, బేబీ పింక్ గౌనులో రాయల్ లుక్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక పూజా నటించిన 'బుట్టబొమ్మ', 'అరబిక్ కుతు', 'జిగేల్ రాణి' వంటి సాంగ్స్ ఇప్పటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. గ్లామర్‌తో పాటు అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆమె ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాల విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్‌తో కలిసి రవి నీలకూడితి దర్శకత్వంలో వస్తున్న 'శ్రీ శ్రీ' చిత్రంతో ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. అలాగే లారెన్స్ హర్రర్ ఫ్రాంచైజీ 'కాంచన 4' వంటి భారీ చిత్రాల్లోనూ నటిస్తూ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు.



# టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు..

## మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ఊగిసలాట!

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** టాలీవుడ్‌లో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి బ్లాక్‌బస్టర్ విజయాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ప్రస్తుతం మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చిత్రాల తర్వాత ఆమె దూసుకెళ్తుందని అంతా భావించినప్పటికీ, 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం ఊహించని పరిణామమైంది. ఇక 'కల్కి 2898 ఏడి' చిత్రంలో ఆమె చేసిన మొక్కుబడి పాత్ర పెద్దగా వర్కౌట్ కాలేదు. ఈ ఏడాది వచ్చిన 'డెకాయిట్' చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచినప్పటికీ, ఆ పాత్రలోని విభిన్నమైన ట్విస్ట్ అభిమానులకు పూర్తిగా కనెక్ట్ కాలేదనే చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఆఫర్ల విషయంలో మృణాల్ కొంత ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అల్లు అర్జున్ రాకా చిత్రంలో ఆమె నటిస్తున్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, మీడియా ప్రశ్నించినా ఆమె ఈ విషయాన్ని నేరుగా ధృవీకరించడం లేదు. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడకూడదన్న నిబంధన కారణంగానే ఆమె స్పందించడం లేదని సమాచారం. మరోవైపు బాలీవుడ్‌లో 2026 ఆమెకు అంతగా కలిసి రాలేదనే చెప్పాలి. 'దో దివానే షెహర్ మే', 'హే జవానీతో ఇష్క్ హోనా హై' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా కొట్టాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'పూజా మేరీ జాన్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైనప్పటికీ సోషల్ మీడియాలో పెద్దగా సౌండ్ చేయలేదు. మొత్తంగా ఉన్నంతలో 'డెకాయిట్' ఒక్కటే ఆమెకు కొంత ఊరటనిచ్చింది. ఇక కథ ప్రకారం 'కల్కి 2'లోనూ ఆమె పాత్ర ఉండాల్సి ఉండగా, దర్శకుడు నాగ్ అశ్విన్ ఏలాంటి మార్పులు చేస్తారనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.



# దర్శకుడి అసభ్య ప్రతిపాదన..

## నటి నీతి టేలర్ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 13 :** సినీ పరిశ్రమలో అవకాశాల పేరుతో కొత్తగా వచ్చే నటీనటులకు ఎదురవుతున్న అనుచిత ప్రతిపాదనలపై బుల్లితెర నటి నీతి టేలర్ సంచలన విషయాలను బయటపెట్టారు. తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదురైన ఓ చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండో సినిమా అవకాశం కోసం ఓ దర్శకుడు తనకు అసభ్యకరమైన షరతు విధించాడని ఆవేదన వ్యక్తం చేశారు. టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నీతి టేలర్, దక్షిణాదిలో తొలి సినిమా పూర్తి చేసిన తర్వాత మరో చిత్రంలో అవకాశం కల్పిస్తానంటూ సదరు దర్శకుడు సంప్రదించాడని తెలిపారు. అయితే ఆ సినిమాలో అవకాశం కావాలంటే తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని షరతు పెట్టడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్నానని, ఆ సమయంలో తల్లి ఇచ్చిన ధైర్యంతో ఆ దర్శకుడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సినిమాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవడంతో మనస్తాపానికి గురై, తిరిగి టెలివిజన్ రంగంపైనే దృష్టి సారించినట్లు నీతి టేలర్ వివరించారు.



# 'బ్రహ్మముడి' రుద్రాణి అసలు లుక్కు చూశారా?

**హైదరాబాద్, అక్టోబరు 13 :** బుల్లితెరపై నటీనటులు పోషించే పాత్రలు ప్రేక్షకులకు ఎంతో దగ్గరవుతుంటాయి. ముఖ్యంగా ధారావాహికల్లో ప్రతినాయకులుగా కనిపించే నటీనటులు తమ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వారిలో నటి షర్మిత గౌడ ఒకరు. తెలుగులో ప్రసారమవుతున్న 'బ్రహ్మముడి' ధారావాహికలో రుద్రాణి పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. తెరపై గంభీరంగా, ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించే ఈమె.. నిజ జీవితంలో మాత్రం ఆధునిక దుస్తులు, ఆకర్షణీయమైన ఫొటోషూట్లతో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నారు. 'బ్రహ్మముడి' ధారావాహికను క్రమం తప్పకుండా చూసేవారికి షర్మిత గౌడ పేరు సుపరిచితమే. ఇందులో రుద్రాణి పాత్రలో కనిపిస్తూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగిన హావభావాలు, సంభాషణలు పలికే తీరు ద్వారా కథలో తన పాత్రకు ప్రత్యేకతను తీసుకొస్తున్నారు. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలో చూపించే గంభీరత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ధారావాహికలో సంప్రదాయబద్ధంగా, గంభీరంగా కనిపించే షర్మిత గౌడ.. వ్యక్తిగత ఫొటోల్లో మాత్రం భిన్నమైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆధునిక దుస్తులు, కొత్త తరహా అలంకరణలు, అందమైన ఫొటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెరపై రుద్రాణిగా కనిపించే రూపానికి, సామాజిక మాధ్యమాల్లో పంచుకునే చిత్రాల్లోని రూపానికి మధ్య ఉన్న వ్యత్యాసం నెటిజన్లను ఆకర్షిస్తోంది. దీంతో ఆమె తాజా చిత్రాలు అభిమానుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. షర్మిత గౌడ నటనా ప్రయాణం కన్నడ టెలివిజన్ రంగంలో ప్రారంభమైనట్లు సమాచారం. అక్కడ పలు ధారావాహికల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'గీత' ధారావాహికలో కథానాయకుడి తల్లి పాత్రలో కనిపించి కన్నడ ప్రేక్షకులకు చేరువైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి. కుటుంబ కథా ధారావాహికల్లో విభిన్న పాత్రలు పోషించిన ఆమె.. తెలుగులో మాత్రం ప్రతికూల ఛాయలున్న రుద్రాణి పాత్రతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇక షర్మిత వ్యక్తిగత జీవితం, కుటుంబ వివరాల గురించి తెలుసుకోవడానికి కూడా అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఆమె వయసు, పుట్టిన తేదీ వంటి వివరాలపై స్పష్టమైన ధ్రువీకరణ లేని సమాచారాన్ని నిజమని భావించకూడదు. ఏదేమైనా, తెరపై పాత్రకు తగ్గట్టుగా నటిస్తూ, బయట తనదైన శైలితో అభిమానులను ఆకట్టుకుంటున్న షర్మిత గౌడ బుల్లితెర ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.